ఆ ప్రశ్నకి అత్తా కోడళ్ళిద్దరికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక ఒకరి వైపు ఇంకొకరు చూసుకున్నారు.

"మీరే జవాబు చెప్పండి." అడిగింది భార్య.

"వాళ్ళల్లో ఎవరికీ ఈ శరీరం చెందదు." సాధువు జవాబు చెప్పాడు,

"వాళ్ళెవరికీ చెందకపోతే అది మరెవరికి చెందుతుంది?" ప్రశ్నించింది తల్లి.

"ఇతనిదే కాదు. మీది, నాది, ఈ ప్రపంచంలోని ప్రతీవారి శరీరం చివరికి రుద్రభూమిలోని చితి మీది అగ్నికి చెందుతుంది. లేదా కుక్కలకో, పురుగులకో చెందుతుంది. ఈ సత్యం తెలుసుకుని మసలుకుంటే పోట్లాటలే ఉండవు."

సాధువు చెప్పదలచుకున్న విషయాన్ని అర్థం చేసుకోలేని తన భార్య, తల్లులకి వివరించాడా గృహస్థు.

"శ్వాస ఆడేంతవరకే సుమా మీరనుకుంటున్నట్లుగా ఈ శరీరం భర్త, కొడుకు, తండ్రి, ఉద్యోగి లేదా ఇంకేదైనా అయేది. ఆ తర్వాత ఇది ఎవరికీ చెందదు. ఊపిరి ఉన్నంత మాత్రం చేత ఈ శరీరధారి ఇతరులకి చెందిన వాడైపోడు. ఈ సత్యం గ్రహించి, దీనికి ఊపిరి ఆడుతున్నంత కాలం మీరు శాంతిగా జీవించి నన్ను శాంతిగా జీవించనీయండి. మనమంతా అద్దె కొంపల్లో ఎవరికి వారు అద్దెకుండేవాళ్ళుగా మసలుకోండి."

"అవును. మనమంతా ఇవాళ ఇంటిలో, రేపు మంటలో అన్న నిజాన్ని ఎన్నడూ విస్మరించకండి" సాధువు బోధించాడు.

## 58. నమ్మకం ముఖ్యం

ఓ సారి ఇబ్రహీం అనే సద్గురువు తన శిష్యుడికి ఆత్మ జ్ఞానం పొందే విద్యని బోధించి, దాన్ని సాధన చేసుకోమని, అంతకు మించి అతను నేర్చుకోవాల్సింది ఇంకేం లేదని చెప్పి వెళ్ళిపోయాడు. ఓ రోజు దారిలో ఆ శిష్యుడికి ఓ రాయి కనిపించింది. దాని మీద చెక్కి వున్న అక్షరాలని చదివాడు.

'నువ్వు మోక్ష మార్గంలో వున్నావా? ఐతే నన్ను ఓ సారి వెనక్కి తిప్పి ఏం రాసి వుందో చదువు'

శిష్యుడు ఆసక్తిగా ఒంగి ఆ రాతిని వెనక్కి తిప్పాడు. అక్కడ ఇలా రాసి వుంది.

'నీ గురువు చెప్పింది నీకు చాలన్న సంగతి గుర్తు లేదా? ఇంకేదైనా మిగిలి వుందని ఎందుకు అనుకుంటున్నావు?'

ఆధ్యాత్మిక సాధకుడికి గురువు మాటల మీద నమ్మకం ముఖ్యం.

## 59. గజ్జి కుక్క

ఓ మహాత్ముడు ఓ గ్రామానికి చాతుర్మాస దీక్ష కోసం వచ్చాడు. ఆయన్ని మంత్ర దీక్ష ఇవ్వమని చాలామంది అడిగితే ఆయన దానికి నిరాకరిస్తూ చెప్పాడు.

"ఆత్మ సాక్షాత్కారం పొందిన పరిపూర్ణ మహాత్ములే ఆ పని చెయ్యాలి. మీకన్నా ఆధ్యాత్మిక జ్ఞానం నాకు ఎక్కువ వుండచ్చు కాని మనమంతా వేరు వేరు తరగతుల్లో చదువుకునే విద్యార్థుల్లాంటివారం. ఇంకా చెప్పాలంటే మనమంతా సాటి ఆధ్యాత్మిక ప్రయాణీకులం. కాబట్టి అందుకు నాకు అర్హత లేదు. ఉందనుకుని మీకు గురువుగా వ్యవహరిస్తే వచ్చే జన్మలో ఎలా పుడతానో చెప్పలేను. అది ఖచ్చితంగా మనుష్య జన్మ అవదు."

నిత్యం ఓ గజ్జి కుక్క కూడా వచ్చి ఆయన చెప్పే ప్రవచనాన్ని వినేది. నాలుగు నెలలు దీక్ష అయేసరికి చిత్రంగా ఆ గజ్జి కుక్కకి వున్న గజ్జి ఎలాంటి మందు లేకుండానే పూర్తిగా పోయింది. ఆఖరి రోజు గ్రామస్థుల్లోని ఆసక్తి గల కొందరు ఆ గజ్జికుక్కకి ఆయన ప్రవచనాలు వినడం వల్లే ఆ గజ్జి పోయిందా అని ఆయన్ని అడిగారు.

"అవును." జవాబు చెప్పాడు ఆయన.

"ఎలా పోయింది?"

"దైవ సంబంధమైన ఏ పని చేసినా అది మన కర్మని నివారిస్తుంది. ప్రతిరోజూ వచ్చి సత్సంగంలో పాల్గొని దేవుడికి సంబంధించిన విషయాలని